కోరలు చాస్తున్న విష సర్పాలు..

పెరుగుతున్న పాముకాట్లు

- 50 రోజుల వ్యవధిలో 92 కేసులు
- బాధితుల్లో నలుగురు చిన్నపిల్లలు
- ఆందోళనలో ప్రజలు



చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పాముకాటు బాధితులు

చల్లపల్లి: చల్లపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పాము కాటుకు గురయ్యేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సగటున రోజుకు ఇద్దరు పాముకాట్లకు గురవుతున్నారు. బాధితు ల్లో ఎక్కువగా పొలాల్లో పనిచేసే రైతు కూలీలే.

50 రోజుల వ్యవధిలో 92 మంది బాధితులు..

మే 26వ తేదీన నుంచి జూలై 15వ తేదీ వరకూ 50 రోజుల వ్యవధిలో మొత్తం 92 మంది పాము కాటుకు గురయ్యారు. 92 మందిలో 47 మంది పురుషులు, 36 మంది మహిళలు, నలుగురు చిన్నపిల్లలు ఉన్నారు.

రైతు కూలీలే ఎక్కువ..

పొలం పనులకు వెళుతున్న రైతులు, కూలీలు ఎక్కువ మంది పాముకాటుకు గురవుతున్నారు. ముఖ్యంగా తాచుపాము, కట్లపాము కాట్లు ఎక్కువగా ఉంటున్నాయి. అతి తక్కువ మాత్రమే రక్తపింజరి కాటుకు గురవుతున్నట్లు వైద్యులు అంటున్నారు. చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోని చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి, మొవ్వ మండలాలకు చెందిన గ్రామాల నుంచి ఎక్కువగా పాముకాటు కేసులు నమోదవుతున్నాయి. చల్లపల్లి చుట్టపక్కల ప్రాంతాలలో మరింత ఎక్కువ మంది బాధితులు ఉంటున్నారు. పొలం పనులు ప్రారంభం కావటం, పొలాల్లోకి నీరు చేరటంతో విషసర్పాలు గట్లపైకి వచ్చి బొరియల్లో స్థావరాలు పెట్టుకుంటాయని అందుకే ఈసీజన్‌లో ఎక్కువ మంది పాముకాటుకు గురవుతారని పలువురు రైతులు చెబుతున్నారు. పూర్తిస్థాయిలో పొలం పనులు ప్రారంభం కాక ముందే పరిస్థితి ఇలా ఉంటే మున్ముందు ఇంకెంత మంది పాముకాట్లకు గురికావాల్సి వస్తుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు.

పాము కాటేసిందని తెలియక..

కొందరు పాము కరిచినట్లు గ్రహించలేక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. లక్షణాలను బట్టి పాముకాటుగా గుర్తించి చికిత్స పొంది ప్రాణాలు కాపాడుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పాము కరిచిన చోట శరీరం మొద్దుబారి పోతుంది. స్పర్శ తెలియదు. విపరీతమైన మంట, కళ్లు మూసుకుపోవటం జరుగుతుంది. రక్తపింజరి కరిస్తే కరిచిన చోట రక్తం గడ్డకడుతుంది. మూత్రం వెంట రక్తం పడటం వంటి లక్షణాలు కనిపిస్తే అది తప్పకుండా పాముకాటుగా గుర్తించి వెంటనే దగ్గర్లోని ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందాలని వైద్యులు చెబుతున్నారు. ఏమాత్రం అశ్రద్ధ చేసినా ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

రక్షణ చర్యలు ఏవీ?

ప్రమాదకర పాముల నుంచి రక్షణ చర్యలు తీసుకునే ప్రయత్నం ఎవరూ చేయటం లేదు. పాములు పట్టే నిపుణులతో రైతు కూలీలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పాముకాటేస్తే ఇలా చేయండి



పాము కాటుకు గురైన వ్యక్తులు కంగారు పడకుండా నిబ్బరంగా ఉండాలి. వేగంగా నడవటం గానీ, పరుగెత్తటం కానీ చేయకూడదు. కాటు వేసిన పైభాగాన ఎటువంటి కట్లు కట్టకూడదు. ఏదైనా వాహనంపై వెంటనే ఆసుపత్రికి చేరుకొని చికిత్స పొందాలి. కొందరు నాటు వైద్యుల వద్దకు వెళ్లి కాలయాపన చేసి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. అలాంటివి చేయకుండా వెంటనే వైద్యుల్ని సంప్రదిస్తే కాపాడుకోవచ్చు.

– డాక్టర్ అవినాష్, జనరల్ మెడిసిన్, సీహెచ్‌సీ, చల్లపల్లి

స్నేక్ వీనమ్స్ అందుబాటులో ఉన్నాయి



ప్రస్తుతం పొలం పనులు ప్రారంభం కావటంవల్ల పాము కాట్ల కేసులు ఎక్కువగా వస్తున్నాయి. ఎప్పటికప్పుడు విషం విరుగుడు మందును ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచుతున్నాం. పాము కరిచిందని ఎలాంటి అనుమానం ఉన్నా ఆసుపత్రికి వస్తే వెంటనే అవసరమైన పరీక్షలు చేసి చికిత్స చేస్తాం.

– బి.ఎస్.శ్రీనివాస్, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, చల్లపల్లి

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



కృత్తివెన్ను: ప్రస్తుతం సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలేందుకు అవకాశం ఉందని, వీటి బారిన పడకుండా ఉండాలంటే ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కృత్తివెన్ను పీహెచ్‌సీ వైద్యులు సాయిసందీప్ అన్నారు. వ్యాధులు, నివారణ, జాగ్రత్తలు అనే అంశంపై మంగళవారం కృత్తివెన్ను గుడిదిబ్బలో ప్రజలకు అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. ప్రజలంతా కాచిచల్లార్చిన నీటిని తాగాలన్నారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తినకుండా వేడిగా ఉన్నప్పుడే భుజించాలన్నారు. వీటితో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా చాలా ముఖ్యమని తెలిపారు. డెంగీ మాసోత్సవాలలో భాగంగా దోమల నిర్మూలన జాగ్రత్తలు వివరించారు సీహెచ్‌వో గంగాధర్, హెచ్‌ఎస్ మేరీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

18 నుంచి పాలిసెట్ తుది విడత కౌన్సెలింగ్

పెడన: పాలిసెట్– 2025లో ఉత్తీర్ణులైన వారికి పాలిసెట్ తుది కౌన్సెలింగ్ ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వెబ్ ఆప్షన్ నమోదు ప్రక్రియ జరుగుతుందని నందమూరు వాసవి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీకే ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం నందమూరు పాలిటెక్నిక్ కళాశాలలో కూడా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

క్లుప్తంగా

మొక్కల సంరక్షణకు గ్రీన్ పాస్‌పోర్టు కార్డుల పంపిణీ



చల్లపల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించటం అలవాటుగా చేసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని పురిటిగడ్డ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన గ్రీన్ పాస్‌పోర్టులను మంగళవారం పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ ప్రతి రెండు నెలలకు ఒకసారి వాటి పెరుగుదల స్థితిని ఈ గ్రీన్ పాస్‌పోర్టు కార్డుల్లో నమోదు చేసుకోవాలని పిల్లలకు వివరించారు. అనంతరం ఒక్కొక్క విద్యార్థి తల్లిదండ్రులతో కలిసి ప్రధాన రోడ్ల వెంబడి మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూలింగ్ ప్లాంట్ ప్రారంభం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 500 లీటర్ల సామర్థ్యం ఉన్న కూలింగ్ ప్లాంట్‌ను మంగళవారం ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ దేవస్థానం తరపున భక్తుల సౌకర్యార్థం కావలసిన మేర ఆలయ ప్రాంగణం చల్లపరుచుకునే విధంగా ఈ ప్లాంట్ వినియోగం ఉంటుందని తెలిపారు. ఆలయ ఘనాపాటి నౌడూరి సుబ్రహ్మణ్యశర్మ, నరేంద్రశర్మ, విరూప్‌శర్మ, ఆలయ సిబ్బంది నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

రేడియం స్టిక్కర్ డ్రమ్ముల ఏర్పాటు



యండకుదురు(ఘంటసాల): జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చల్లపల్లి సీఐ ఈశ్వరరావు తెలిపారు. మండలంలోని యండకుదురు పంచాయతీ శివారు జీలగలగండి కాలనీ వద్ద జాతీయ ప్రధాన రహదారిపై రేడియం స్టిక్కర్లతో కూడిన ప్లాస్టిక్ డ్రమ్ములను ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ ఈశ్వరరావు మాట్లాడుతూ లంకపల్లి, జీలగలగండి మార్గమధ్యలో వాహనదారుల వేగాన్ని నియంత్రించేందుకు జిగ్ జాగ్ డ్రమ్ములను ఘంటసాల పోలీసుల సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు అప్రమత్తంగా ఉంటూ డ్రైవింగ్ చేయాలని సీఐ సూచించారు.

పీహెచ్‌సీలో భవన నిర్మాణ పనులు ప్రారంభం



బంటుమిల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నూతన భవన నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంటు పీహెచ్‌సీలో పూర్తి సౌకర్యాలతో ల్యాబ్ గదులు, టాయ్‌లెట్స్ నిర్మాణానికి రూ.50 లక్షలు నిధులు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు గత రెండు సంవత్సరాలుగా పనులు చేపట్టలేదు. దీనిపై ఆగ్రహం వక్తం చేసిన జిల్లా కలెక్టరు బాలాజీ హెచ్చరికలతో కాంట్రాక్టరు కొద్ది రోజులుగా పనులు చేపట్టి బెడ్ కాంక్రీట్ పనులు పూర్తి చేశాడు. ఈ భవనం నిర్మాణంతో రోగులకు పీహెచ్‌సీలో పూర్తి సౌకర్యాలు అందుబాటులో వస్తాయని వైద్యులు పేర్కొన్నారు.

ఘనంగా యూత్ స్కిల్స్ డే



మచిలీపట్నంటౌన్: స్థానిక లేడీయాంప్తిల్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం వరల్డ్ యూత్ స్కిల్స్ డే ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీరమ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ పీఎం సిరీస్ ఒకేషనల్ కోర్స్ బ్యూటీ అండ్ వెల్నెస్ సబ్జెక్టు టీచర్‌గా రమ్యని నియమించి విద్యార్థినుల చదువుతో పాటు ఇతర స్కిల్స్ పెంపొందించేదుకు కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థినులకు డ్రాయింగ్, క్విజ్, రోల్‌ప్లే వంటివి నేర్పించారు. హెచ్‌ఎం శ్రీరమ విద్యార్థినులకు కెరియర్ గైడెన్స్, బహుమతులను ప్రధానం చేశారు.

పంటల బీమా చెల్లించేలా చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ డీకే బాలాజీ



పీఎం ఫసల్ బీమా యోజన పథకం వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని రైతులందరూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ప్రీమియం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన చాంబర్‌లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే పంటలు నష్టపోకుండా రైతులు ముందుగానే పంటల బీమా చేసుకోవటం చాలా ముఖ్యమన్నారు. గత సంవత్సరం బుడమేరు వరదల వల్ల జిల్లాలో చాలా పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారన్నారు. జిల్లాలో వరి పంటను గ్రామం యూనిట్‌గా, పసుపు పంటను జిల్లాను యూనిట్‌గా దిగుబడి ఆధారంగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. జిల్లాలో టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు బీమా అమలు ఏజెన్సీగా ఉన్నారన్నారు. వరిపంటకు ఎకరానికి రూ.830, పసుపు పంటకు ఎకరానికి రూ.1100 ప్రీమియం చెల్లించాల్సి ఉందన్నారు. వరి పంటకు ఆగష్టు 15వ తేదీ వరకు, పసుపు పంటకు ఈ నెల 30వ తేదీ వరకు చెల్లింపు గడువు ఉందన్నారు. జిల్లాలో పంట రుణాలు తీసుకున్న ప్రతి రైతు నుంచి బీమా ప్రీమియం వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పంట రుణాలు తీసుకోని రైతులను వ్యవసాయశాఖ అధికారులు చైతన్యపరిచి బీమా ప్రీమియం చెల్లింపు జరిగేలా తగిన చొరవ చూపాలన్నారు. బ్యాంకులు, మీ సేవా కేంద్రాలు, పంట బీమా పోర్టల్, సచివాలయాలు, తపాలా కార్యాలయాల్లో ప్రీమియం చెల్లించవచ్చన్నారు. అనంతరం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై ముద్రించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో వ్యవసాయశాఖ ఏడీ మణిధర్, ఎల్‌డీఎం రవీంద్రరెడ్డి, ఉద్యానశాఖ అధికారి జె. జ్యోతి, జలవనరులశాఖ ఎస్ఈ ఆర్.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంబీకే భవనంలో అగ్నిప్రమాదం

రూ.9.50 లక్షల మేర ఆస్తినష్టం



మంటలు వ్యాపించిన ఎంబీకే భవనం నాలుగవ అంతస్థు



పెదప్రోలులో మంటల్లో కాలిపోయిన వరిగడ్డి వామి

అవనిగడ్డ: స్థానిక ఎంబీకే భవనంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదం ఈ ప్రాంత వాసులను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. ఈ ప్రమాదంలో రూ.9.5 లక్షల ఆస్తినష్టం సంభవించినట్టు అంచనా. కాగా అవనిగడ్డ, రేపల్లె అగ్నిమాపక సిబ్బంది రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. అవనిగడ్డ అగ్నిమాపక అధికారి సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఎస్‌బీకే రోడ్డులోని ఎంబీకే భవనం (ఏ1మార్టు బిల్డింగ్) 403 రూములో ఇండియన్ బ్యాంకు మేనేజర్ రవితేజ కుటుంబం అద్దెకు ఉంటోంది. గదిలోని ఏసీకి మరమ్మతులు చేయించి గ్యాస్ పెట్టించారు. ఏసీ ఆన్ చేసిన తరువాత కొద్ది సేపటికే మంటలు వచ్చి క్షణాల్లో గదంతా వ్యాపించాయి. వెంటనే రవితేజ భార్య, పిల్లలు బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. సమాచారం తెలిసిన వెంటనే అవనిగడ్డ అగ్నిమాపక అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. లోపల ఉన్న గ్యాస్ సిలిండర్లను బయటకు తీసుకొచ్చారు. నాలుగవ అంతస్తు కావడంతో రేపల్లె అగ్నిమాపక కేంద్రానికి కూడా సమాచారం ఇచ్చారు. సిబ్బంది రెండు గంటల పాటు శ్రమించి మిగిలిన ప్రాంతాలకు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. ఈ భవనం కింద ఏ1 మార్టు, సమీపంలో ఎస్‌బీఐ బ్యాంకు, పక్కనే భవనాలు ఉండటంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో విలువైన బంగారు, వెండి ఆభరణాలు, కొంత నగదు, ఫర్నీచర్, వస్తువులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. రూ.9.50 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు చెప్పారు.

8 ఎకరాల్లో వరిగడ్డివామి అగ్నికి ఆహుతి

పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పెదప్రోలు గ్రామంలో రైతు బాచు శ్రీనివాసరావుకు చెందిన 6 ఎకరాలు, తోట వెంకటేశ్వరావుకు చెందిన మరో 2 ఎకరాల్లో వరిగడ్డి వాములు అగ్నికి ఆహుతయ్యాయి. బాధిత రైతులు శ్రీనివాసరావు, వెంకటేశ్వరావు తెలిపిన వివరాల మేరకు మంగళవారం ఉదయం గడ్డివామి వద్ద ఒక్క సారిగా మంటలు చెలరేగడంతో వేగంగా గడ్డివామి కాలిపోయింది. మంటలు ఆర్పే సమయంలో బాచు శ్రీనివాసరావు తండ్రి కృష్ణమూర్తికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి అగ్నిప్రమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అవనిగడ్డ నుంచి అగ్ని మాపక వాహనం రావడం ఆలస్యం కావడంతో గడ్డివామి పూర్తి కాలిపోయినట్లు తెలిపారు. నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ బాధితులను పరామర్శించారు. ఆయన వెంట జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు సనకా ప్రశాంత్, మెరకనపల్లి నరేష్, బోగిరెడ్డి సాంబయ్య, బాదర్ల లోలాక్షుడు, అరజా కిరణ్‌కాంత్, కామిశెట్టి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల మండలాలకు ప్రత్యేకంగా గతంలో అగ్ని మాపక కేంద్రం చల్లపల్లిలో ఉండేదని, అక్కడ వాహనాన్ని తీసేయడంతో అవనిగడ్డ నుంచి వచ్చే వాహనం ఆలస్యం కావడం వల్ల ప్రమాదంలో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని చల్లపల్లిలో వాహనాన్ని పునరుద్ధరించాలని కోరారు.

ఎంపీ మోడల్ పాఠశాల పరిశీలన



నారాయణరావునగర్‌లో ఎంపీ మోడల్ స్కూల్లో భోజనం చేస్తున్న డైట్ అధ్యాపకులు

చల్లపల్లి: స్థానిక నారాయణరావునగర్‌లోని మండల పరిషత్ మోడల్ పాఠశాలను కృష్ణా జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) అధ్యాపకులు చండిక వేణుగోపాల్ బృందం మంగళవారం సందర్శించారు. ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, పాఠశాలకు వచ్చే పిల్లల సంఖ్య, విద్యార్థులకు ఇచ్చిన యూనిఫాం, షూస్, స్కూల్‌బ్యాగ్ వినియోగిస్తున్న తీరు వంటి అంశాలను పరిశీలించారు. ఇక్కడ ఐదో తరగతి చదివి బయటకు వెళ్లిన విద్యార్థులు మరలా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరారా.. లేదా, కొత్తగా ఇక్కడ చేరిన విద్యార్థుల సంఖ్య వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం ఈ స్కూల్లో 92 మంది పిల్లలు ఉన్నారని తెలిపారు. కొన్ని బృందాలు జిల్లాలోని అన్ని పాఠశాలలను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. తాను చల్లపల్లి, ఘంటసాల, మచిలీపట్నం, రెడ్డిగూడెం పాఠశాలలను తనిఖీ చేయనున్నట్లు వివరించారు. అనంతరం పిల్లలతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఎంఈవోలు కె.సుజాత, పి.వెంకటేశ్వరరావు, క్లస్టర్ హెచ్‌ఎం ఎం.రాజా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కై తేపల్లి దాస్, ఉపాధ్యాయులు విజయదుర్గ, రాధారాణి, దుర్గాప్రసాద్, బుల్లియ్య ఉన్నారు.

ప్రసన్నాంజనేయస్వామికి కూరగాయలతో అలంకరణ



చిలకలపూడి(మచిలీపట్నం): ఈడేపల్లి ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం స్వామివారిని శాకాంబరిగా అలంకరించారు. నగరానికి చెందిన చిలంకుర్తి శేషాచార్యులు, సీతాదేవి దంపతులతో పాటు పలువురు భక్తులు ఈ అలంకారానికి సహకారం అందించినట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. దీంతో పాటుగా ఆలయానికి వచ్చే భక్తుల కోసం మామిడిబత్తుల వీరాంజనేయులు మజ్జిగ పంపిణీ నిర్వహించారు. కదంబ ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. మేకపోతుల పూర్ణచంద్రరావు, తోట పవన్‌కిషోర్ కుటుంబ సభ్యులు ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు.

పీ4 విధానంపై అవగాహన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పేదరిక నిర్మూలన– పీ4 విధానంపై అధికారులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ పీ4 అనేది పేదరిక నిర్మూలన కల్పించడం, మెరుగైన భవిష్యత్తు నిర్మించడం ప్రభుత్వ, ప్రైవేట్ ప్రజల భాగస్వామ్యం (పీ4) చేయడం అనే కార్యక్రమాన్ని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమం ప్రవాస ఆంధ్రుల సంపన్న కుటుంబాలను రాష్ట్రంలోని అత్యంత వెనుకబడ్డ 20 శాతం కుటుంబాలకు సహాయం చేయడానికి, ప్రోత్సహించడానికి, ప్రగతి వైపు నడిపించేందుకు రూపొందించారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వెనుకబడిన కుటుంబాలను ప్రత్యక్షంగా దత్తత తీసుకుని వారికి మార్గదర్శకత్వం, ఆర్థిక సహాయం, ఉద్యోగ అవకాశాలను కల్పించే మార్గాలను ఏర్పాటు చేసి వారిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో, పెడన నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ కన్నమనాయుడు, డీఎల్‌డీవో పద్మావతి, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో ఎక్స్‌రే సేవలు ప్రారంభం



ఎక్స్‌రే సేవలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, వైద్యులు

చల్లపల్లి: స్థానిక 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో లభించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కోరారు. రూ.6 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఎక్స్‌రే యూనిట్‌ను మంగళవారం బుద్ధ ప్రసాద్ ప్రారంభించారు. తొలుత ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం కొత్తగా నిర్మించిన బయో వ్యర్థాల నిల్వ గదులను ప్రారంభించారు. వార్డుల్లో ఉన్న రోగులను కలిసి రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బుద్ధప్రసాద్ మాట్లాడుతూ గుండెపోటు వచ్చినప్పుడు అత్యవసరంగా వినియోగించే రూ.40 వేలు విలువ గల ఇంజెక్షన్లు కూడా ఇక్కడ ఉన్నాయని వివరించారు. ఆసుపత్రి కమిటీ సభ్యులు వరదా హరిగోపాల్ ఎమ్మెల్యేకు శాలువాకప్పి సన్మానించారు. కార్యక్రమంలో కొడాలి ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పంచాయతీ కార్యదర్శి పేర్ని మాధవేంద్రరావు, సీఐ ఈశ్వరరావు, ఆసుపత్రి సూరింటెండెంట్ బి.ఎస్.శ్రీనివాస్, వైద్యులు అవినాష్, సుమా చౌదరి, శైలజ, వంశీకృష్ణ, ఉమామహేష్, మోర్ల రాంబాబు, రావి రాజు, అడపా రవి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నారు లాగేముందు కార్బోఫ్యూరాన్ గుళికలు చల్లాలి



కోనేరుసెంటర్: వ్యవసాయంలో రైతులకు అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వడంతో పాటు సందేహాలను నివృత్తి చేసేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఏవో స్టాన్లీ తెలిపారు. మండల పరిధిలోని పెద్దయాదర, వాడపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామాల రైతులతో కలిసి పొలాలను పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ నారుమడులో నారు లాగడానికి 10 రోజుల ముందు ఐదు సెంట్ల నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు వేయాల్సిందిగా సూచించారు. కాండం తొలిచే పురుగు నివారణకు ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ముదురు నాటు నాటేటప్పుడు నారు కొనలను తుంచి వేయాలని సూచించారు. నాట్లు వేసేటప్పుడు ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల ఖాళీ బాటలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పంట పొలాల మధ్య అనధికార చెరువు తవ్వకం

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రైతులు



చల్లపల్లి మండలం చెన్నకేశవకోడు పక్కన అనుమతులు లేకుండా తవ్వుతున్న చెరువు

చల్లపల్లి: పంట పొలాల మధ్యన ఉన్న డ్రెయినేజీ భూమిని ఆక్రమించుకుని అనధికారికంగా తవ్వుతున్న రొయ్యల చెరువు కారణంగా 300 ఎకరాల సారవంతమైన పంట పొలాలు చౌడుభూములుగా మారే ప్రమాదం ఉందని మూడు గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై కలెక్టర్ డీకే బాలాజీని కలిసి గోడు విన్నవించుకున్నారు. చల్లపల్లి, ఘంటసాల మండలాలకు చెందిన సుమారు 200 మందికి చెందిన 300 ఎకరాలు పంట భూములను సాగుచేసుకుంటున్నారు. చెన్నకేశవ డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న పోరంబోకు భూమిలో ఓ వ్యక్తి కొంత భూమిని ఆక్రమించుకుని వరి సాగు చేస్తున్నాడు. తాజాగా వరి మాగాణి భూమిని రొయ్యల చెరువుగా మార్చేందుకు కట్టలువేయించాడు. దీని వల్ల తమకు నష్టమని ఆగ్రహించిన రైతులు విషయాన్ని తహసీల్దార్ డి.వనజాక్షికి చెప్పగా స్పందించకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ అధికారులతో ఫోన్లో మాట్లాడి చెరువు కట్టలు తొలగించాలని ఆదేశాలు యిచ్చి నట్లు రైతులు తెలిపారు. దీనిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని డ్రెయినేజీ ఏఈ చిరంజీవి తెలిపారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకుల ధర్నా

గుడివాడ టౌన్: వాహనాలు బ్రేక్ చేసే విధానాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం దుర్మార్గపు చర్య అని లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు అన్నారు. మంగళవారం గుడివాడ ఆర్టీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఉద్యోగులను కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. నాయకులు మాట్లాడుతూ పట్టణానికి 70 కిలోమీటర్ల దూరంలో బ్రేక్ సెంటర్ ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. గుడివాడ ఆర్టీఓ కార్యాలయంలోనే బ్రేక్ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరారు. ప్రైవేట్ వ్యక్తులకు వ్యవస్థను అప్పగించే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.